క్లుప్తంగా

వెంకన్న కల్యాణోత్సవాలకు రాట ముహూర్తం



దేవస్థానం ప్రాంగణంలో పందిరి రాటను పాతుతున్న ఈవో వెంకటేశ్వరరావు, కౌన్సిలర్, అర్చకులు

అమలాపురం టౌన్: కోనసీమ పెళ్లిళ్ల వెంకన్నగా పేరుగాంచిన అమలాపురం వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో ఏప్రిల్ 7వ తేదీన జరగనున్న స్వామివారి కల్యాణోత్సవాలకు సంబంధించి పందిరి రాట ముహూర్తం సోమవారం శాస్త్రోక్తంగా జరిగింది. దేవస్థానంలో ప్రాంగణంలో ఉదయం 9.49 గంటలకు భక్తులు, పుర ప్రజలు, అర్చకుల సమక్షంలో పందిరి రాటను వేసి పూజలు చేశారు. దేవస్థానం ఈవో యర్రా వెంకటేశ్వరరావు, మున్సిపల్ కౌన్సిలర్ గండి హారిక, అర్చకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. పందిరి రాట ముహూర్తం అయ్యాక అక్కడే అర్చకులు పూజలు చేశారు.

బాల్య వివాహాల నివారణపై అవగాహన



అనాతవరంలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థినులు

ముమ్మిడివరం: ప్రతి ఒక్కరూ బాల్య వివాహాలపై అవగాహన పెంచుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పల్లవి పేర్కొన్నారు. మహిళా దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని సోమవారం మహిళా శిశు సంక్షేమ శాఖ, పీపుల్స్ ఆర్గనైజేషన్ సంయుక్త ఆధ్వర్యంలో అనాతవరం ప్రభుత్వ పాఠశాల నుంచి విద్యార్థులచే సైకిల్ ర్యాలీ నిర్వహించారు. విద్యార్థినులతో బాల్య వివాహలపై ప్రతిజ్ఞ చేయించారు. బాలకార్మిక చట్టాలపై అవగాహన, వెట్టి చాకిరి, బాలల హక్కులు, మహిళా హక్కులు, వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాలపై జీవీఎస్ ఎన్‌దేవి, భవాని, అంగన్‌వాడీ వర్కర్స్, మాణిక్యాంబ, రాజేశ్వరి, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి



చిన్నారులకు కిట్లను అందిస్తున్న సర్పంచ్ బుల్లియ్య, రమణారావు తదితరులు

ఉప్పలగుప్తం: అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులపై ప్రత్యేక శ్రద్ధ చూపి విద్య నేర్పించాలని గుడ్ సీడ్ ఫౌండేషన్ ఫౌండర్, అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు కుంచే రమణారావు సూచించారు. గోపవరం అంగన్‌వాడీ కేంద్రంలోని 33 మంది చిన్నారులకు సోమవారం గుడ్ సీడ్ ఫౌండేషన్ తరఫున పాదరక్షలు, సాక్స్‌ల కిట్లను చైర్మన్ రమణారావు అందజేశారు. స్థానిక సర్పంచ్ కుంచే బుల్లియ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు కొంకి ఏడుకొండలు, గ్రామ పెద్దలు, అంగన్‌వాడీ, సిబ్బంది, గుడ్ సీడ్ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

విలీన ప్రక్రియను నిలిపివేయాలి



విలీన ప్రక్రియను ఆపాలంటూ నిరసన తెలుపుతున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

అల్లవరం: స్థానిక సడక్ రోడ్డులోని మండల పరిషత్ పాఠశాలలను అల్లవరం అభ్యుదయ పాఠశాలలో 3, 4, 5 తరగతులను విలీనం చేసే ప్రక్రియను మండల విద్యా శాఖ తక్షణమే నిలిపివేయాలని పాఠశాల ఆవరణంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు సోమవారం నిరసన తెలిపారు. ఎంపీపీ పాఠశాలలకు అభ్యుదయ పాఠశాల రెండు కిలోమీటర్ల దూరంలో నిత్యం రోడ్డుపై భారీ వాహనాల రద్దీ ఉన్నందున విద్యార్థుల ప్రాణాలకు ముప్పు ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. విలీనం చేసే ప్రక్రియను తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో భీమేశ్వరరావు, సత్యవాణి, దుర్గాభవాని, వెంకటలక్ష్మీ, సుభాణి, అలివేలు, దివ్య జ్యోతి, దుర్గ, ఆదిలక్ష్మీ, సూర్యకుమారి, గుర్రం రాజ్యలక్ష్మీ, కంకిపాటి వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

శ్మశాన వాటిక అభివృద్ధిపై అసంతృప్తి

- గడువు పూర్తయినా పనులు మొదలుపెట్టని మున్సిపాలిటీ
- కమిషనర్‌ను కలిసిన హిందూ శ్మశానం అభివృద్ధి కమిటీ
- నాలుగు రోజుల్లో ప్రారంభిస్తామని హామీ



మున్సిపల్ కమిషనర్ రాజుకు వినతిపత్రం అందజేస్తున్న అభివృద్ధి కమిటీ ప్రతినిధులు

అమలాపురం టౌన్: పది రోజుల క్రితం అమలాపురం బైపాస్ రోడ్డులో కాలువ వద్ద ఉన్న శ్మశాన వాటికి అభివృద్ధిని కోరుతూ హిందూ శ్మశానం అభివృద్ధి కమిటీ ధర్నా చేసింది. అంత్యక్రియ సమయంలో పడుతున్న ఇబ్బందులను తెలియజేసింది. అప్పుడు మున్సిపాలిటీ నాలుగు రోజుల్లో అభివృద్ధి పనులు చేపడతామని గడువు ఇచ్చింది. ఆ గడువు దాటి వారం రోజులు కావస్తున్నా అభివృద్ధి పనులు మొదలు పెట్టకపోవడంపై మున్సిపాలిటీ తీరుపై హిందూ శ్మశాన అభివృద్ధి కమిటీ అసంతృప్తి వ్యక్తం చేసింది. దీంతో కమిటీ ప్రతినిధులు స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ కేవీఆర్ఆర్ రాజు, డీఈఈ సీహెచ్, నాగ సతీష్‌లతో సోమవారం మరోసారి భేటీ అయ్యారు. ముందు ఇచ్చిన గడువు దాటి పోయిందని, పనులు ఎప్పుడు నుంచి మొదలు పెడతారని ప్రతినిధులు వంటెద్దు వెంకన్నాయుడు, కముజు రమణ, కల్వకొలను బాబి, కాంథ్రేగుల కృష్ణ, కల్వకొలను ఉమ తదితరలు కమిషనర్‌ను ప్రశ్నించారు. శ్మశానంతో పాటు పక్కనే ఉన్న మున్సిపల్ డంపింగ్ యార్డ్‌ను ఇక్కడ నుంచి శాశ్వతంగా వేరే చోటకు తరలించాన్న కమిటీ డిమాండ్‌పై దానికి కొంత సమయాన్ని మున్సిపాలిటీ కోరింది. శ్మశాన అభివృద్ధి పనులు ఎప్పటి నుంచి చేపడతారో స్పష్టమైన హామీ ఇస్తేనే గాని తాము ఇక్కడ నుంచి కదలమని పట్టుబట్టారు. దీంతో కమిషనర్ రాజు స్పందించి 'వచ్చే నాలుగు రోజుల్లో శ్మశానంలో ఒక దశగా కొన్ని పనులు చేపడతామని, మిగిలిన పనులు మరో 15 రోజుల్లో పూర్తి చేస్తామని కమిషనర్ తమకు హామీ ఇచ్చారని కమిటీ ప్రతినిధులు తెలిపారు. దీంతో శ్మశానంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనుల జాబితాతో కూడిన వినతి పత్రాన్ని కమిషనర్ రాజుకు అందజేశారు. పట్టణంలోని దాదాపు సగం వార్డుల నుంచి సుమారు 22 వీధులు, కాలనీలకు ఈ శ్మశానమే దిక్కు అని కమిటీ ప్రతినిధులు కమిషనర్‌కు వివరించారు. శవాన్ని అంతిమ యాత్రతో శ్మశానికి తీసుకుని వస్తున్నా ఇక్కడ తగిన సౌకర్యాలు లేక ఇబ్బంది పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. హిందూ శ్మశాన వాటిక అభివృద్ధి కమిటీ ప్రతినిధులు యల్లమిల్లి రాజ మోహన్, బొంతు నాగభూషణం, కేతా వెంకట లక్ష్మీ నారాయణ, పితాని త్రిమూర్తులు, మోసుగంటి చిట్టి బాబు, ముత్తాబత్తుల గణేష్ తదితరులు కమిషనర్‌తో జరిగిన చర్చల్లో పాల్గొన్నారు.

మత్స్యకార గ్రామాల్లో ఆధ్యాత్మిక శోభ

- వైభవంగా విజయ కనకదుర్గ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ
- మాజీ ఎమ్మెల్యే పొన్నాడ ప్రత్యేక పూజలు



విజయకనకదుర్గ అమ్మవారిని దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే పొన్నాడ తదితరులు

తాళ్లరేవు: కోరంగి పంచాయతీ పెదబొడ్డు వెంకటాయపాలెం, చినబొడ్డు వెంకటాయపాలెం గ్రామాల మధ్యన నదీ తీరాన నిర్మించిన విజయ కనకదుర్గ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు వైభవంగా జరిగాయి. సోమవారం అమ్మవారి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ శాస్త్రోక్తంగా నిర్వహించారు. వేద పండితులు ప్రత్యేక పూజలు చేసి, అమ్మవారి ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాలను ఘనంగా చేశారు. సుమారు పది మంది దంపతులచే విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దుర్గా మల్లేశ్వరస్వామివార్ల శాంతి కల్యాణాన్ని కన్నుల పండువగా జరిపించారు. దీంతో మత్స్యకార గ్రామాల్లో ఆధ్యాత్మిక శోభ నెలకొంది. అగ్నికుల క్షత్రియ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బొడ్డు సత్యనారాయణ ఆధ్వర్యంలో గ్రామస్తుల సహకారంతో జరిగిన ఈ కార్యక్రమానికి ముమ్మిడివరం మాజీ ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ హాజరై అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ నిర్మాణానికి సహకరించిన వారిని బొడ్డు సత్యనారాయణ సత్కరించారు. ఈ కార్యక్రమంలో కాదా గోవిందకుమార్, కొపనాతి నాగరాజు, వైదాడి శ్రీనివాసరావు, వాడ్రేవు వీరబాబు, బర్రే లక్ష్మీ నరసింహరాజు, పెయ్యల మంగేష్, పోతుల రత్న కుమారి ఆయా గ్రామాల పెద్దలు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా ఇంజినీర్ వీరన్న జయంతి



విశ్రాంత ఇంజినీర్ శ్రీహరిని సత్కరిస్తున్న మహిళా వాకర్స్ ప్రతినిధులు

అమలాపురం టౌన్: స్థానిక మహిళా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక భూపయ్య అగ్రహారంలో అలనాడు సర్ ఆర్థర్ కాటన్‌తో కలిసి ధవళేశ్వరం బ్యారేజ్ నిర్మాణంలో విధులు నిర్వర్తించిన తెలుగు ఇంజినీర్ వీణం వీరన్న 231వ జయంతి కార్యక్రమం జరిగింది. ఆ సందర్భంగా క్లబ్ అధ్యక్షురాలు యర్రమిల్లి అనంతలక్ష్మి అధ్యక్షతన జరిగిన జయంతి సభలో పలువురు మహిళా వాకర్స్ మాట్లాడారు. ధవళేశ్వరం బ్యారేజ్‌లో ఇంజినీర్‌గా పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన శిష్టా శ్రీహరిని మహిళా వాకర్స్ ఘనంగా సత్కరించారు. విశ్రాంత ఇంజినీర్ శ్రీహరి మాట్లాడుతూ ఇంజినీర్ వీణం వీరన్న బ్యారేజ్ నిర్మాణంలో అందించిన సేవలను కొనియాడారు. సభలో క్లబ్ కార్యదర్శి గోటేటి లక్ష్మి, కోశాధికారి కంకటాల విజయలక్ష్మి, ఎస్.లక్ష్మీదేవి, పేరి లలిత, వాకర్స్ బులిటన్ ఎడిటర్ పుత్సా కృష్ణ కామేశ్వర్, గోటేటి గంగాధరరావు తదితరులు పాల్గొన్నారు. తొలుత ఇంజినీర్ దివంగత వీణం వీరన్న చిత్ర పటతానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

ప్రణాళికాబద్ధంగా చదివితే ఉత్తమ ఫలితాలు

డీఎస్పీ ప్రసాద్



పాఠశాల వార్షికోత్సవంలో డీఎస్పీ ప్రసాద్‌ను సత్కరిస్తున్న శేషారెడ్డి, శృతిరెడ్డి

అమలాపురం టౌన్: పరీక్షలు దగ్గర పడిన సందర్భంగా విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదవాలని, అప్పుడే ఉత్తమ ఫలితాలు సాధిస్తారని అమలాపురం డీఎస్పీ టీఎస్ఆర్‌కే ప్రసాద్ అన్నారు. స్థానిక గొల్లగూడెంలోని ఆదిత్య పాఠశాల 9వ వార్షికోత్సవానికి డీఎస్పీ ప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. పాఠశాల ప్రిన్సిపాల్ కుంపట్ల లక్ష్మీదేవి అధ్యక్షతన పాఠశాలలో సోమవారం రాత్రి జరిగిన ఈ వేడుకలకు మరో ముఖ్య అతిథిగా ఆదిత్య విద్యా సంస్థల చైర్మన్, మాజీ ఎమ్మెల్సీ నల్లమిల్లి శేషారెడ్డి పాల్గొని ప్రసంగించారు. చదువుపై విద్యార్థులు ప్రణాళిక బద్ధంగా, అప్రమత్తంగా ఉండాలని శేషారెడ్డి సూచించారు. డాక్టర్ సీహెచ్ సాయి వాణి విద్యార్థులకు నీతి మాటలతో కూడిన సూచనలు చేశారు. ఆదిత్య విద్యా సంస్థల డైరెక్టర్ ఎస్.శృతిరెడ్డి మాట్లాడారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు తల్లిదండ్రులను ఆకట్టుకున్నాయి. ఒలింపియాడ్స్ తదితర పరీక్షల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతుల ప్రదానం చేశారు. చివరిగా ముఖ్య అతిథి డీఎస్పీ ప్రసాద్‌ను శేషారెడ్డి, శృతిరెడ్డిలు ఘనంగా సత్కరించారు.

శివారు భూములకు సాగునీరు అందించాలి

తాళ్లరేవు: మండల పరిధిలోని శివారు భూములకు సాగునీటిని పూర్తిస్థాయిలో సరఫరా చేయాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.హరిబాబు, సహాయ కార్యదర్శి బి.రంగారావు, కాకినాడ జిల్లా కార్యదర్శి వల్లు రాజబాబు, ఎస్‌కే మస్తాన్, యూ.మూర్తి తదితరులు కోరారు. ఈ మేరకు రాష్ట్ర ఇరిగేషన్ డిప్యూటీ ఛీఫ్ ఇంజినీర్ తిరుమలరావుకు వినతి పత్రం అందజేశారు. ధవళేశ్వరం ఆనకట్ట నుంచి సాగునీటి కాలువ కోటిపల్లి మీదుగా సుమారు 70 కిలోమీటర్ల శివారున ఉన్న తాళ్లరేవు మండల పరిధిలోని భూములకు సాగునీరు అందడం లేదన్నారు. పి.మల్లవరం, జార్జీపేట, నీలపల్లి, పోలేకుర్రు, కోరంగి, చొల్లంగి, జి.వేమవరం, చొల్లంగిపేట గ్రామాలలో ఉన్న పంట పొలాలలకు గత పదేళ్లుగా దాళ్వాలో నీరు అందక రైతులు నష్టపోతున్నారన్నారు. మండలంలో సుమారు 800 ఎకరాలకు సాగునీటి ఇబ్బంది ఏర్పడుతుందన్నారు. సాగునీటి ఇబ్బందికి గల కారణాలను పరిష్కరించి పూర్తిస్థాయిలో నీరు అందించే చర్యలు చేపట్టాలని లేకుంటే రైతులు రోడ్డెక్కే పరిస్థితి వస్తుందని హెచ్చరించారు.

కోరింగ అభయారణ్యాన్ని సందర్శించిన విద్యార్థులు



కోరింగ అభయారణ్యాన్ని సందర్శించిన ఫిషరీస్, ఆదిత్య విద్యార్థులు

తాళ్లరేవు: ప్రముఖ పర్యాటక ప్రదేశం కోరింగ అభయారణ్యాన్ని సోమవారం ఫిషరీస్, ఆదిత్య కళాశాల విద్యార్థులు సందర్శించారు. ప్రపంచ వన్యప్రాణుల దినోత్సవం సందర్భంగా అవగాహన సదస్సు నిర్వహించారు. తొలుత ప్రముఖ ప్రదేశాలన్నింటినీ ఆసక్తిగా తిలకించారు. చెక్కల వంతెనలపై నడుస్తూ, బోటు షికారు చేసి ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం జరిగిన సదస్సులో అభయారణ్యంలోని మడ అడవుల విశిష్టత, పక్షుల వివరాలను ఫారెస్ట్ రేంజర్ ఎస్ఎస్ఆర్ వరప్రసాద్ వారికి వివరించారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ ఎస్.వీరభద్రరావు, కె.సిద్ధార్థ, ఎఫ్‌బీఓలు కె.మహేష్, సీహెచ్ ధనలక్ష్మి, కె.ధనుంజయరావు, ఎస్‌కెఎం సుభాని, ఫారెస్ట్ సిబ్బంది పాల్గొన్నారు.

కోనసీమకు విమానాశ్రయాన్ని మంజూరు చేయాలి

కోనసీమ క్షత్రియ సేవా సంఘం కో ఆర్డినేటర్ ఇందుకూరి ఎంపీకి వినతి

అమలాపురం టౌన్: ఒక పక్క సముద్రం, మూడు పక్కల గోదావరి పాయల నడుమ ప్రకృతి అందాలతో ఉన్న పర్యాటక ప్రాంతమైన కోనసీమకు విమానాశ్రమాన్ని కేంద్ర ప్రభుత్వం నుంచి మంజూరు చేయించేలా చర్యలు చేపట్టాలని అమలాపురం ఎంపీ గంటి హరీష్ మాధుర్‌కు కోనసీమ క్షత్రియ సేవా సమితి కో ఆర్డినేటర్ ఇందుకూరి నరసింహరాజు వినతి పత్రాన్ని అందించారు. అమలాపురంలోని ఎంపీ క్యాంపు కార్యాలయంలో ఎంపీ హరీష్ మాధూర్‌ను ఆయన సోమవారం కలిసి వినతి పత్రాన్ని అందించారు. ఈ ప్రాంతానికి విమానాశ్రమం ఆవశ్యకతపై మాట్లాడారు. మీ తండ్రి బాలయోగి లోక్‌సభ స్పీకర్‌గా పని చేసేడప్పుడు కోనసీమకు విమానాశ్రమాన్ని తేవాలన్ని ప్రయత్నించిన విషయాన్ని ఆయన ఎంపీకు గుర్తు చేశారు. కోనసీమ ప్రాంతం పర్యాటకంగా అభివృద్ధి చెందుతున్న క్రమంలో, రైలు సాకారం కానున్న సమయంలో ఈ ప్రాంతానికి విమానాశ్రమం కూడా అత్యవసరమవుతుందని నరసింహరాజు ఎంపీకి వివరించారు. కోనసీమ క్షత్రియ సేవా సంఘం ప్రతినిధి సరిపెల్ల సత్యనారాయణరాజు, సమితి సభ్యులతో కలసి ఆయన వినతిపత్రం అందించారు.

కాట్రేనికోన ఎంపీపీ పాలెపు లక్ష్మి మృతి



పాలెపు లక్ష్మి (ఫైల్)



కాట్రేనికోన ఎంపీపీ పాలెపు లక్ష్మి భర్త ధర్మారావును పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్

కాట్రేనికోన: స్థానిక ఎంపీపీ పాలెపు లక్ష్మి(55) అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. ఆమె మృతికి మాజీ ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్ కుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పితాని బాలకృష్ణ, టీటీడీ ఆధ్యాత్మిక చానల్ మాజీ అడ్వైజర్ అడపా దుర్గ, పార్టీ సీనియర్ నాయకుడు ఏడిది చక్రపాణీరావు శ్రద్ధాంజలి ఘటించారు. పార్థివ దేహంపై పూలమాలలు ఉంచి నివాళులు అర్పించారు. గత రెండేళ్లుగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న పాలెపు లక్ష్మి అమలాపురం ఏరియా ఆసుపత్రిలో డయాలసిస్ చేస్తున్న సమయంలో తుదిశ్వాస విడిచారు. ఆమె అంత్యక్రియలు పవిత్ర పుణ్యక్షేత్రం కుండలేశ్వరం శ్మశాన వాటిక వద్ద నిర్వహించారు. సతీ వియోగంతో బాధపడుతున్న వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు పాలెపు ధర్మారావును మాజీ మంత్రి పినిపే విశ్వరూప్ ఫోన్‌లో పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ కన్వీనర్ నల్లా నరసింహమూర్తి, ఏడిది సుబ్బు, సంసాని నాగేశ్వరరావు, గంటి వెంకట సుధాకర్, దాసరి కాసుబాబు, కాటం సత్తిరాజు, సర్పంచులు, ఎంపీటీసీలు, కార్యకర్తలు, నాయకులు తదితరులు శ్రద్ధాంజలి ఘటించారు.

అప్పు తీర్చమంటోందన్న అక్కసుతో మహిళపై దాడి

అమలాపురం టౌన్: భర్త నుంచి విడాకులు తీసుకుని బతుకుతున్న ఓ మహిళ మరిది తీసుకున్న అప్పు తిరిగి అడిగినందుకు మొత్తం కుటుంబ సభ్యులంతా ఒక్కటై ఆమెపై దాడికి దిగారు. బాధిత మహిళ పోలాబత్తుల లలితాదేవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణ సీఐ పి.వీరబాబు కేసు నమోదు చేశారు. దీనిపై పట్టణ ఎస్సై తల్లిబోయిన శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం... విడాకులు తీసుకుని స్థానిక గొవ్వాలవారి వీధిలో నివసిస్తున్న లలితాదేవి గతంలో తన మరిది పోలాబత్తుల సత్య విష్ణుకు రూ.3.30 లక్షల అప్పు ఇచ్చింది. మూడు నెలల కిందట తన కుమార్తెకు పెళ్లి చేసిన లలితాదేవి అప్పటి నుంచి తన అప్పు తీర్చమని మరిదిని కోరింది. నీ కుమార్తె పెళ్లికి తాను రూ.1.50 లక్షలు దాకా ఖర్చు చేశానని, ఇప్పుడు అప్పు తీర్చలేనని మరిది సత్యవిష్ణు తెగేసి చెప్పాడు. అప్పు తీర్చమని లలితాదేవి ఒత్తిడి చేస్తుండడంతో ఆమెపై అక్కసు పెంచుకున్న మరిది సత్య విష్ణు, ఆమె భర్త సుబ్బారాయుడు, మరో మరిది సురేష్, వారి తల్లి, ఇతర కుటుంబ సభ్యులు గత నెల 28న మూకుమ్మడిగా దాడి చేసి గాయపరిచారు. ఈ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై చెప్పారు.

క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 19 మంది ఎంపిక

తాళ్లరేవు: కోరంగిలోని కోరింగా కాలేజ్ ఆఫ్ ఫార్మసీ కళాశాలలో సోమవారం సినర్జీ కంపెనీ నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 19 మంది విద్యార్థులకు ఉద్యోగావకాశాలు లభించాయి. కళాశాల సెమినార్ హాలులో విశాఖపట్నం సినర్జీ కంపెనీ రీసెర్చ్ డిపార్ట్‌మెంట్ హెడ్ ఆర్.చరణ్, హెచ్ఆర్ మేనేజర్ పి.రవితేజ, అసిస్టెంట్ మేనేజర్ కె.నవీన్‌లు విద్యార్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ ప్రగళ్లపాటి కనకరాజు, కళాశాల డైరెక్టర్ చిట్టూరి కలికిమూర్తిలు ఉద్యోగాలకు ఎంపికైనవారికి నియామక పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎన్.సువర్ణజ్యోతి, డాక్టర్ గోవిందకమల్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ రవిప్రకాష్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

అల్లవరం: కొమరగిరిపట్నంలో నిరుపేద కుటుంబానికి చెందిన జనిపెల్ల కృష్ణమూర్తికి బీజేపీ నాయకులు నల్లా పవన్ ఆధ్వర్యంలో సోమవారం ఆర్థిక సాయం చేశారు. నిరుపేద కుటుంబానికి బియ్యం, బట్టలు, నిత్యావసరాలు, నగదు అందించి ఉదారత చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో తులా బ్రహ్మజీ, తులా శ్రీను, తులా చిన్నా తదితరులు పాల్గొన్నారు.

ఆక్సిజన్ కాన్సంట్రేటర్ల వితరణ



ఆక్సిజన్ కాన్సంట్రేటర్లతో అమలాపురం లయన్స్ క్లబ్ ప్రతినిధులు

అమలాపురం టౌన్: మాజీ లోక్ సభాపతి దివంగత జీఎంసీ బాలయోగి 23వ వర్ధంతి కార్యక్రమాన్ని పురస్కరించుకుని బాలయోగి ఫౌండేషన్ ఆధ్వర్యంలో అమలాపురం పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఆయన తనయుడు, ఎంపీ గంటి హరీష్ మాధుర్ 35 ఆక్సిజన్ కాన్సంట్రేటర్లను సమకూర్చారు. పేద కుటుంబాలకు చెందిన వ్యాధిగ్రస్తులకు ఆక్సిజన్ అవసరమైతే అత్యవసరంగా ఉపయోగపడే రీతిలో ఈ కాన్సంట్రేటర్లు ఉచితంగా సరఫరా చేయనున్నట్టు ఎంపీ కార్యాలయం తెలిపింది. 25 కాన్సంట్రేటర్లను పలు స్వచ్ఛంద సంస్థలు, పీహెచ్‌సీలకు అందజేశారు. ఇందులో భాగంగా అమలాపురం లయన్స్ క్లబ్‌కు ఒకటి అందించారు. ఎంపీ ద్వారా లయన్స్ క్లబ్ అధ్యక్షుడు రవణం వేణుగోపాలరావు, లయన్స్ ప్రతనిధులు జంపన సుమన్‌వర్మ, బూరగాయల శివరామకృష్ణ, గుర్రం రామకృష్ణ, పెనుమాల చిట్టిబాబు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

జూనియర్ ఇన్‌స్పెక్టర్ల నియామకం



సీఎం రంగసామి చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్న దేవసరాజు

యానాం: పుదుచ్చేరి కో ఆపరేటివ్ శాఖ ద్వారా ఇటీవల కో ఆపరేటివ్ జూనియర్ ఇన్‌స్పెక్టర్ పోస్టులకు నిర్వహించిన రాతపరీక్షలో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులకు సోమవారం కామరాజర్ మణి మండపంలో సీఎం రంగసామి నియామకపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా పుదుచ్చేరి రాష్ట్రస్థాయిలో ద్వితీయ ర్యాంకు సాధించిన యానాంకు చెందిన దేవనరాజు సైతం నియామకపత్రాన్ని అందుకున్నారు. అదేవిధంగా కోపరేటివ్‌శాఖలో భాగమైన పాన్‌లైట్ విభాగంలో నియామకాలకు, సీఎస్‌సీ బ్యాంకు ద్వారా లబ్ధిదారులకు రుణాలు, డిపాజిట్లు సేకరణలో ఉత్తమసేవలు అందించిన పీఎస్‌సీ బ్యాంకు శాఖలకు అవార్డులు ఆయన అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎల్జీ కె.కైలాషనాథన్, ప్రధానకార్యదర్శి చౌహాన్, కోపరేటివ్ కార్యదర్శి జయంత్‌కుమార్‌రే, రిజిస్ట్రార్ యశ్వంతయ్య పాల్గొన్నారు.

మాజీ లోక్‌సభ స్పీకర్ బాలయోగికి ఘన నివాళి



బాలయోగి నివాళులర్పిస్తున్న మంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మ, ఎంపీ హరీష్ మాధుర్ తదితరులు



బాలయోగి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఆర్‌ఏఓ మునిస్వామి తదితరులు

అమలాపురం రూరల్: స్థానిక జీఎంసీ బాలయోగి ఘాట్ వద్ద సోమవారం బాలయోగి విగ్రహానికి కేంద్ర భారీ ఉక్కు పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మ, ఎంపీ గంటి హరీష్ మాధుర్ పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. మాజీ ఎమ్మెల్యేలు మానేపల్లి అయ్యాజీ వేమా, చిల్లా జగదేశ్వరి, జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్ యళ్ల దొరబాబు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మోకా వెంకట సుబ్బారావు, నాయకులు పవన్‌కుమార్, సత్యానందం రామకృష్ణ పాల్గొన్నారు.

ముమ్మిడివరం: మాజీ లోక్ సభ స్పీకర్ స్వర్గీయ జీఎంసీ బాలయోగి వర్ధంతిని సోమవారం ముమ్మిడివరంలో నిర్వహించారు. స్థానిక పోలమ్మ చెరువు గట్టున గల జీఎంసీ బాలయోగి విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద, చెల్లి అశోక్, గుత్తుల సాయి, తాడి నరసింహారావు, పొద్దోకు నారాయణరావు, దొమ్మేటి రమణకుమార్, అర్థాని శ్రీనివాసరావు, చిక్కాల అంజిబాబు, యాళ్ల ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

తాళ్లరేవు: కోనసీమ అభివృద్ధి ప్రదాత, స్వర్గీయ జీఎంసీ బాలయోగి ఆదర్శప్రాయుడని పలువురు కొనియాడారు. సోమవారం స్థానిక అంబేడ్కర్ భవన్ వద్ద గల విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. నీలపల్లి జమ్మిచెట్టు సెంటర్‌లోని విగ్రహానికి స్థానిక నేతలు చిట్టూరి కలికిమూర్తి, వస్కారెడ్డి, పిల్లి సత్తిబాబు, కొల్లాటి వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

యానాం: ఉభయగోదావరి, యానాం తదితర ప్రాంతాల అభివృద్ధికి విశేష కృషి చేసిన దివంగత మాజీ లోక్‌సభ స్పీకర్ జీఎంసీ బాలయోగి చిరస్మరణీయులని పలువురు పేర్కొన్నారు. సోమవారం సమాచారశాఖ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో స్థానిక మినీ సివిల్‌స్టేషన్ ఎదురుగా ఉన్న బాలయోగి విగ్రహానికి ఆర్ఏఓ మునిస్వామి తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పలువురు మాట్లాడుతూ యానాం-ఎదుర్లంక బాలయోగి వారధి, 216 జాతీయ రహదారి నిర్మాణం, కోటిపల్లి- నర్సాపురం రైల్వే లైను తదితర మైన అభివృద్ధి కార్యక్రమాలకు ఆయన శ్రీకారం చుట్టారన్నారు. సీఐ షణ్ముగం, ట్రాఫిక్ ఎస్సై శేరు నూకరాజు, పీఆర్‌ఏ కొల్లు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయం చేయాలంటూ వినతి

యానాం: పుదుచ్చేరి అగ్నిమాపకదళ శాఖ నిర్వహించిన రాత పరీక్షలో ఫైర్‌స్టేషన్ ఆఫీసర్ ఉద్యోగానికి ఎంపికైన తనపై పలువురు నిరాధార ఫిర్యాదులు చేస్తూ ఇబ్బందులు పెడుతున్నారని తనకు న్యాయం చేయాలని కోరుతూ సోమవారం కనకాలపేట గ్రామస్తులతో కలిసి బాధిత అభ్యర్థి కోన వీరబాబు ఆర్ఏఓ మునిస్వామికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను ఈడబ్ల్యూఎస్ కోటాలో ఏకైక ఫైర్‌స్టేషన్ ఆఫీసర్ ఉద్యోగానికి పుదుచ్చేరి స్థాయిలో మెరిట్‌లో ఎంపికైనట్టు తెలిపారు. అయితే కొంతమంది తనకు లేని భూములు, ఇళ్లపట్టాలు, భవనాలు ఉన్నాయంటూ ఈడబ్ల్యూడీ సర్టిఫికెట్ రాకుండా తప్పుడు ఫిర్యాదులు డిప్యూటీ తహసీల్దార్‌కు ఇస్తున్నారని ఆవిధంగా తనకు వచ్చిన ఉద్యోగ అవకాశాన్ని కోల్పోయేలా చేస్తున్నారని, తనను మానసిక వేదనకు గురిచేస్తున్నారన్నారు. వీటిపై క్షేత్రస్థాయిలో అధికారులు సమగ్ర విచారణ చేసి తనకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సోషల్‌యాక్టివిస్టు సుంకర కార్తీక్, కనకాలపేట గ్రామస్థులు కాటంశెట్టి రామ్మూర్తి, మాగాపు సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

అనుమతి లేని భవన అంతస్తుల ధ్వంసం

రావులపాలెం: స్థానిక శెట్టిబలిజనగర్‌లో ఇటీవల నిర్మించిన ఒక బిల్డింగ్‌పై అంతస్తులను సోమవారం పంచాయతీ అధికారులు ధ్వంసం చేశారు. దీనిపై పంచాయతీ సెక్రెటరీ ఎల్.దుర్గాప్రసాద్ మాట్లాడుతూ కోర్టు ఇచ్చిన ఉత్తర్వుల నేపథ్యంలో బిల్డింగ్ దారుడు అనుమతి పొందిన దాని కంటే ఎక్కువ అంతస్తులు నిర్మించడంతో కోర్టు ఉత్తర్వులు నేపద్యంలో అనధికార అంతస్తులను ధ్వంసం చేసినట్టు తెలిపారు.

ముగిసిన మహా శివరాత్రి వేడుకలు

అమలాపురం రూరల్: పాత బండారులంక భువనేశ్వరి సమేత త్రయంబకేశ్వర స్వామి ఆలయంలో మహా శివరాత్రి వేడుకలు సోమవారంతో ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా వీరభద్ర స్వామిలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో అన్నసమారాధన నిర్వహించారు. శ్రీశైలం మాజీ ట్రస్టీ చింతా శంకరమూర్తి, సర్పంచి పెనుమాల సునీత, రాష్ట్ర దేవాంగ సంక్షేమ సంఘం అధ్యక్షుడు వూటుకూరి సుబ్రహ్మణ్యం స్వామి, పిచ్చిక శ్యామ్, పుత్సల వరదరాజు, పడవల బాలాజీ, పాల్గొన్నారు.